# వలపులో మలుపు

ప్రతాప రవిశంకర్ & మద్దాళి ప్రదీప్ కుమార్

"యువర్ ఎటెన్షన్ ప్లీజ్ ... ది సర్కార్ ఎక్స్‌ప్రెస్ ఈజ్ రెడీ టు స్టార్ట్ విత్ ఇన్ ఫ్యూ మినిట్స్...." ఎనౌన్స్ చేశారు గబ గబా అడుగులువేసి ప్లాట్ ఫారం మీదకు అడుగు పెట్టాను.

తెల్లని దీపాల కాంతిలో గుంటూరు రైల్వేస్టేషను కొత్తపెళ్ళి కూతురిలా మిల మిలా మెరిసి పోతూంది. యూనిఫారంలో వున్న పోర్టర్లు ప్లాట్ ఫారం మీద నెత్తిమీద బరువుతో హడావిడిగా తిరుగుతున్నారు.

ప్లాట్ ఫారం పెళ్ళి కొంపలా కళకళలాడుతోంది. ప్లాట్ ఫారం మీద కదలబోతున్న ఎక్స్‌ప్రెస్ పెద్ద కూతవేసి మెల్లగాముందుకు కదిలింది. బోగీ ద్వారం ప్రక్కన అంటించిన లిస్టులో నా పేరు పడింది. సూట్ కేసును గట్టిగా పట్టుకొని లోపలకు ఎక్కాను. లోపల ఒక సీటు ఖాళీగా వుంది. సీట్లో సూట్ కేసును పడేసి దాని పక్కనే కూర్చున్నాను. నాకు ఎదురుగా వున్న సీట్లో ఒక అమ్మాయి కుర్చొని వుంది. నా అదృష్టం పండిందనుకున్నాను. మామూలు అమ్మాయి కాదు. పంచరంగుల చిత్రంలో కథానాయికలా కంపార్టు మెంట్ లో పురుగుల మధ్య నించి పడుతున్న తెల్లనిలైటు కాంతిలో వెలిగిపోతోంది. ఆమెను రెప్పవాల్చకుండా అణువణువూ పరిశీలనగా చూశాను.

మబ్బురంగు పట్టుచీరకు ఎర్రఅంచుమీది జల్తారు మెరుపులతో ఆకాశం నుండి ఊడి పడిన అపర రతీదేవిలా వుంది. ఆఅమ్మాయి మెడను కౌగలించుకున్నట్లున్న ఒంటిపేట గోల్డు చైను మెలికలు తిరిగి చీర అంచు మీదగా గుండెలమీద కదులుతోంది. చెవులకు ఎర్రరాతి దుద్దులు దీపాల కాంతిలో తళుక్కున మెరుస్తున్నాయి. అమాయకత్వం నింపుకున్న నల్లని కళ్ళు - నున్నటి పాలు కారుతున్న చెక్కిళ్ళు - నుదుటి మీదకు పడుతున్న ముంగురులు - కుడిచేతికి గుండ్రటి వాచీ, - ఎడమచేతికి నాలుగు బంగారు గాజులు ఆఅమ్మాయి కదలినప్పుడు వింత శబ్దాన్ని చేస్తున్నాయి. వంకీలు తిరిగి నడుమును దాటిన పొడుగాటిజడ. ఏదో ఆకర్షణ ఆ అమ్మాయిలో వుంది.

చూపును మరల్చి ముఖాన్ని కిటికీ వైపు తిప్పాను. డిమ్‌గా వెలుగుతున్న పచ్చ లైటును దాటిపోయింది రైలు. సిగ్నల్ స్తంభాలు వెనక్కి వెళ్ళిపోతున్నాయి. రైలు ముందుకు పోతున్నది.

సూట్ కేసులో నించి మేగజైను తీసి పేజీలు తిప్పుతున్నాను. మధ్య మధ్యలో ఓరకంటతో ఆ అమ్మాయిని చూస్తున్నాను. నేను తిరగేస్తున్న పేజీలవైపు ఆ అమ్మాయి ఆసక్తిగా చూస్తోంది. దానిని చేత్తో అలాగే పట్టుకుని "మేగజైన్ చూస్తారా?" అని

అడిగాను.

"అవున్... అదేంకాదండీ... మా ఫ్రెండ్ రాసిన కథ ఈ మేగ్‌జైన్‌లో పడిందని చెప్పింది నిన్న .... చూద్దామని" చిరునవ్వు విసిరింది ఆ హీరోయిన్.

మాట్లాడినప్పుడు గొంతులో సన్ననిజీర - మధుమాసపు పున్నమిరేయిలో మామిడి కొమ్మమీద కూర్చుని లేతమామిడి చివుళ్లు తిని ఆనందంతో పరవశించి పాడే కోయిల గొంతులోని తీయదనపుకదలికే ఆ అమ్మాయి గొంతులో వుంది.

"మీ ఫ్రెండ్ పేరు?" అడిగాను

"రేణుక" నవ్వుతూ చెప్పింది.

"రేణుకగారు ఇదివరలో రాసిన కథలు చాలా చదివాను. చాలా బాగా రాస్తుంది" అన్నాను.

"రేణుక కథ పడటం ఇదే మొదటిసారి, అలాంటప్పుడు ఆ అమ్మాయి కథలు బాగా రాస్తుందని మీకెలా తెల్సు." అడిగింది ఆ అమ్మాయి.

నా గొంతులో పచ్చివెలక్కాయ పడింది.

"ఆ మాత్రం తెలుసుకోలేమండీ .... రేణుక అనే పేరే చాలా బ్యూటిఫుల్‌గా వుంది. కథ బాగుంటుందనటంలో ఎటువంటి సందేహం లేదు" నవ్వేస్తూ అన్నాను.

ఆ అమ్మాయి కిలకిలా నవ్వింది. ఆ నవ్వులో కోటి వెన్నెలల వెలుగు కనిపించింది. తెల్లని ముత్యాల్లాంటి పలువరుస. నవ్వు ఆపి అన్నది "అందమైన పేర్లు ఉన్నవాళ్ళందరూ అందమైన కథలు రాస్తారంటారా?"

"డెఫినెట్‌గా రాస్తారు. మీకు డౌటుగా వుందా?" ఆ అమ్మాయి నుదుటిమీద గాలికి కదులుతున్న ముంగురులు తిరిగిన వెంట్రుకలను చూస్తూ అడిగాను.

"అవును. నాదొక చిన్న డౌట్" అన్నది ముంగురులను వెనక్కి నెట్టేస్తూ....

"అడగండి" అన్నాను ధీమాగా.

"మీ పేరు?" అడిగింది.

"కృష్ణమూర్తి" అని చెప్పాను.

"మీ పేరు అందంగానే వుంది. అంత మాత్రాన మీరు అందమైన కథలు రాయగలరంటారా?" దెబ్బకొట్టింది నవ్వుతూనే ....

నాకు ఏమని చెప్పాలో తెలీలేదు. నిజానికి నాకు కథలు చదవటమంటేనే విసుగు. ఇంకా రాయటం కూడానా. అందంగా రాయగలనని చిన్న అబద్ధం ఆడెయ్యవచ్చు. అవును. అదే సులువైన మార్గం. రాయలేనని ఎందుకు చెప్పాలి?

"అలనాడు పెద్దనగారు ఊహ తెలియగల ఊయల మంచంలో పడుకుని గ్రంథ రచన చేశాడుట. ఈ రోజు నేను మీలాంటి అందమైన అమ్మాయి ఎదురుగా కూర్చుని నవ్వుతుంటే, ఆయనకు మించి వందలాది కథలు రాసి నా ప్రేమకథలతో తెలుగువారి హృదయాల్లో కలకాలం నిలిచిపోగలను" అన్నాను.

నా మాటలు బాగా పనిచేశాయి, "మీలాంటి అందమైన"— ఆ మాట ఆ అమ్మాయి మీద మంచి ప్రభావం చూపింది. అమ్మాయి అందంగా వున్నా, లేకపోయినా నువ్వు రంభవి, రతీదేవివి అని పొగిడితే వాళ్ళు, వాళ్ళ విశాల హృదయంలో మనల్ని ఒక మూల పడేస్తారని, ఎప్పుడో చదివిన నవలలో ఎవడో అనుభవజ్ఞుడు రాసిన జ్ఞాపకం. దెబ్బ కొట్టేశాను. ఆ అమ్మాయి కలువ మొగ్గలా ముడుచుకుపోయింది. ఎర్రగా కందిన నున్నటి చెక్కిళ్ళు లైటు వెలుతురులో తమాషాగా కనిపిస్తున్నాయి. తల వంచుకుని చీర అంచుమీద డిజైనును తదేకంగా చూస్తూ కూర్చుంది.

"మీ పేరు?" కొంచెం ధైర్యం చేసి అడిగాను.

ఆ అమ్మాయి ఇంకా సిగ్గుపడిపోయింది. తలయెత్తకుండానే చూపుడు వ్రేలితో రాస్తూ చీర పమిట కొంగును వ్రేలితో చుట్టి పెడుతూ

తీయగా అంది "రాధ"

"ఆ పేరంటే నా కెంతో ఇష్టం." అన్నాను.

ఆమె తల యెత్తలేదు.

వంచిన మొహం మీద రెండు కనుబొమల మధ్య కొంచెం పైగా వున్న నీలిరంగు తిలకం బొట్టు కెంపులాగా మెరుస్తూంది.

"మీరు ఎక్కడి దాకా వస్తారు?" అడిగింది రాధ.

పెళ్ళి చూపులకు వెడుతున్నానని చెప్పటానికి సిగ్గుపడి ఉద్యోగ విషయమై నెల్లూరు వరకు వెడుతున్నానని చెప్పాను.

"నేను కూడా నెల్లూరు వరకు వస్తాను" అన్నది రాధ.

డిసెంబరునెల చివరి రోజులు. గాలిలో చల్లదనం ఎక్కువగా వుంది. సూట్ కేసును తెరిచి స్వెట్టరు తీసి వేసుకున్నాను. రాధ కూడా బాగ్‌లోనించి ఎర్రకలరు స్వెట్టరు తీసి వేసుకుంది.

"బాగా చలేస్తుంది కదూ!" బెర్తుమీద పక్కపరచుకుంటూ అడిగాను. నిద్రముంచుకొస్తూంది. క్రిందటిరాత్రి స్నేహితుల బలవంతంతో ఆఫీసు మేనేజరిగారితో మొదటి తారీఖు జీతాలందుకుని సెకండ్ షో- వెళ్లాను.

అవునన్నట్లు కళ్ళను గమ్మత్తుగా తిప్పి కనురెప్పలను టపటప లాడించింది రాధ.

పరువంతో మిడిసిపడుతున్న పండువెన్నెలలో జలకాలాడుతున్న చిన్నచిన్నపొదలూ, పొలాలూ, కొండలూ, రైలు చక్రాలు చేసే భయంకర శబ్దానికి భయపడి వెనక్కి పారిపోతున్నాయి. లేత నలుపురంగు చీరను కప్పుకున్న ఆకాశంలో నక్షత్రాలు దూరం దూరంగా పడివున్నాయి. తెల్లనిమంచు బింధువులు క్రిందకురాలుతూ గాలితో ఆడుకుంటున్నాయి.

నా కళ్ళు మూతలు పడుతున్నాయి. రాధ మేగజైను చదువుతోంది. ఫాను గిరగిరా తిరుగుతోంది. చలి ఇంకా ఎక్కువగావుంది.

"మీకు నిద్ర రావడంలేదా" రాధను అడిగాను.

ఎందుకన్నట్లు నా వంక చూసింది.

"నాకు నిద్ర వస్తోంది. నెల్లూరు రాగానే నన్ను లేపండి. ఆ ఫాను కూడా ఆపు చేయండి. లేకపోతే చలితో మనం ఈ కంపార్టుమెంటులోనే బిగుసుకుపోవాల్సి వస్తుంది" దుప్పటి కప్పుకుంటూ అన్నాను.

ఫాను తిరగటం ఆగిపోయింది.

మెల్లగా నిద్రలోకి జారుకున్నాను.

"ఏమండీ!....ఏమండీ!" రాధ నన్ను పిలుస్తోంది. నెల్లూరు స్టేషను దగ్గర్లోకి వచ్చిందేమో! నేను మెలకువ వచ్చినా కళ్ళు తెరవలేదు. రైలు వేగం తగ్గింది. నా భుజంమీద చెయ్యి వేసి కుదిపింది రాధ. షాక్ కొట్టినట్లు ఫీలయ్యాను. అబ్బ... ఎంత వెచ్చటి స్పర్శ...ఇప్పటివరకు బ్రహ్మచారిగా వున్న నేను రాధ చేతి స్పర్శ తగలటంతో మా నాన్న చేసే పెళ్ళేదో త్వరగా చేస్తే బాగుండుననిపించింది. ఇక మరీ నిద్రపోయినట్లు నటిస్తే బాగుండదని మత్తుగా కళ్ళు తెరుస్తూ "ఏమిటండీ రాధగారూ" అంటూ లేచి కూర్చున్నాను.

"స్టేషను వచ్చింది" అన్నది రాధ.

"అప్పుడే వచ్చిందా" అని లేచి దుప్పటిని మడత పెట్టి సూట్ కేసులో పెట్టాను.

రైలు ఆగింది.

స్టేషనులో జనం పల్చపల్చగా వున్నారు. టిక్కెట్లు ఇచ్చి ఇద్దరం బయటకు వచ్చాం.

రాధా రిక్షా మాట్లాడి ఎక్కికూర్చుంది.

"మీ మేగ్‌జైన్ నా దగ్గరే వుండిపోయింది" అంటూ మేగ్‌జైన్‌ను తిరిగి ఇవ్వబోయింది.

"మనిద్దరి స్నేహానికి గుర్తుగా దాన్ని మీదగ్గరే వుంచుకోండి" అన్నాను.

"మరి నా జ్ఞాపకంగా ఏమివ్వమంటారు?"

"మీ వెచ్చని చేతి స్పర్శ చాలు అదో దివ్యమైన అనుభూతి. ఆ మధురమైన అను

చూతే నా జీవితం మిమ్మల్ని గుర్తుంచుకొనేలా చేసింది." మనసులోనే అనుకుని పైకి "మీతో గడిపిన ఈ కొద్దిక్షణాలు చాలు" అన్నాను.

"గుడ్ నైట్ మూర్తిగారూ" చెయ్యి ఊపుతూ రిక్షాలో వెళ్ళిపోయింది రాధ.

నేను రిక్షా వెళుతున్న వైపే చూస్తూ నిల్చునిపోయాను.

* * *

నేను, మాఅమ్మ,నాన్న ముగ్గురం పెళ్ళివారి యింటి ముందు జట్కాలో నుంచి దిగాము "రండి బావగారూ !" అంటూ ఎదురుగా వచ్చాడొకాయన. ఆయన పెళ్ళికూతురి బాబాయిట. లోపలికి వెళ్ళి కుర్చీలో కూర్చున్నాము. మా ముందు రెండు చిరు చాపలు పరిచి వున్నాయి. వాటిమీద ఎర్రని, ఆకుపచ్చని అందమైన డిజైన్లున్నాయి. నేను గోడలకు తగిలించిన ఫొటోలను చూస్తున్నాను.

కాఫీ ఫలహారాలు ముగించాము.

"అమ్మాయిని తీసుకురండి అన్నయ్యగారూ !" అన్నది మా అమ్మ.

ద్వారంవైపు చూశాను. ఒక గదిలోనుంచి పెళ్ళికూతుర్ని తీసుకువచ్చారు. కలహంస నడకలతో వయ్యారంగా జానపద సినిమాలో రాజకుమారి రాజశ్రీలాగా నడుస్తూవచ్చి తల యెత్తి నన్ను చూసింది సిగ్గుతో...

క్షణకాలం ఆశ్చర్యపోయి మూగవాణ్ణయాను, నేను ఎవరైతే నా అర్ధాంగి కావాలనుకున్నానో ఆమే నా ఎదురుగా నిలబడి వుంది. నాతో కలిసి రైలులో ప్రయాణించిన అమ్మాయే ఈ రోజు నా జీవన పయనంలో కూడా కలసి ప్రయాణించటానికి సిద్ధంగా వుంది.

రాధ కూడా సంభ్రమంతో నా వైపు చూస్తున్నది. చుట్టూ వున్న వారందరూ మా ఇద్దరినీ మార్చి మార్చి చూస్తున్నారు.

నేను సన్నగా నవ్వాను.

సిగ్గు తెర రాధ ముఖాన్ని క్రమ్మివేసింది.

వారంరోజులు తిరక్కుండానే మా పెళ్ళి ఘనంగా జరిగిపోయింది.

• • •

పందిరి పట్టెమంచం - హృదయంలో తియ్యని కోర్కెలను రేపే అగరువత్తుల ఘుమ ఘుమలు - బల్లమీది పలహారాలూ - ఇవన్నీ చూస్తూ తొలిరేయి హాయిని ఊహించుకుంటూ రాధకోసం ఎదురు చూస్తున్నాను.

రాధను లోపలకు నెట్టి తలుపులు బిగించి వెళ్ళిపోయారు ఎవరో సరసులు. సిగ్గుతో తలుపు దగ్గరే నిల్చున్నది రాధ. నేను మంచం దిగి నిల్చున్నాను.

కొత్త పెళ్ళికూతురికి సిగ్గు సహజం రాధా, అది అందంకూడా .... ఇప్పుడు నువ్వెంత అందంగా వున్నావో !" రాధను నా రెండు చేతులతో పొదివి పట్టుకుని మంచం దగ్గరకు నడిపించుకు వచ్చాను.

నా బాహువుల్లో బందీయై నా గుండెల మీద వాలిపోయింది రాధ.

ఆ రాత్రి ఎప్పుడు నిద్ర పట్టిందో నాకు తెలీదు.

తెల్లవారి నట్టుంది. ఎవరో తలుపులు కొడుతున్నారు.

రాధా నా బిగికౌగిలినుంచి వెళ్ళి తలుపు తీసింది." పళ్ళపొడి డబ్బా మీ గదిలోనే వుందట.... కొంచెం ఇస్తావా వదినమ్మా" నా చిన్న చెల్లెలు గీతిక నవ్వుతూ అన్నది.

నా ప్రాణం ఉస్సూరు మంది. తలుపు తీయకుండా వున్నా బాగుండేది.

గూట్లోవున్న పళ్ళపొడి డబ్బాను గుమ్మం దగ్గరే నిలబడి గీతికకు అందించింది రాధ. పళ్ళపొడి డబ్బాతోపాటు రాధ చెయ్యి పట్టుకుని బయటకులాగి "ఇంకెంత సేపు వదినమ్మా.... పళ్ళపొడి వేసుకుని పళ్ళు తోము

కాక అన్నది గీతిక నవ్వుతూ...

గీతిక మీద కోపం వచ్చింది. ఈడ్చి దవడమీద కొడదా మనిపించింది. రాధ తలలోనించి పక్కమీద రాలిన మల్లెల్ని గుప్పిటలోకి ఏరుకొని ముసుగుతన్ని పడుకున్నాను.

"ఇంకా ఎంత సేపు నిద్రపోతారండీ ... లేవండి' అన్నది రాధమ్మగారు. ఏభై ఏళ్ళ కృష్ణమూర్తిగారి తలమీద "ముసుగు కప్పుకున్న దుప్పటి తీస్తూ....

"అబ్బా.... ఏమిటిరాధా.... కమ్మని కల చెదరగొట్టావ్" విసుక్కున్నారు కృష్ణమూర్తిగారు.

"ఏం కలండీ అది" ఆసక్తిగా అడిగింది రాధమ్మగారు.

"ఏమి కలేమిటే పిచ్చిదానా!! మనిద్దరం రైల్లో కలుసుకోవటం—ఆ తర్వాత పెళ్ళి—ఆ తర్వాత తతంగం—నీ సిగ్గులు—అలకలు—ఇంతలో గీతిక రావడం — పళ్ళపొడి డబ్బా—నువ్వు నాచేతుల్లోనించి తప్పించుకొని వెళ్ళిపోవటం....నువ్వు ఇప్పటిదాకా నాకౌగిట్లోనే వున్నావు రాధా" అన్నారు కృష్ణమూర్తిగారు రాధమ్మగారిని హృదయానికి హత్తుకుంటూ....

"బాగుందండి సంబడం .... ఏభైయేళ్ళొచ్చి పిల్లలకు పెళ్ళిళ్ళుచేసి ఇప్పుడు మళ్ళీ పెళ్ళిట. తతంగాలుట — అలకలుట — పళ్ళపొడి డబ్బాట...బాగానేవుందికానీ వేషం .... లేచి స్నానంచేసి స్టేషనుకు వెళ్ళండి....అమ్మాయి గుంటూరునుంచి ఈరోజే వస్తానని రాసింది" అంటూ కృష్ణమూర్తిగారిని వెనక్కినెట్టేసి విసవిసా నడుచుకుంటూ పోయింది ఆయనగారి డియరెస్ట్‌వైఫ్ రాధమ్మగారు.

★

# వైద్య సలహాలు

— డా॥ జొన్నలగడ్డ వీరాస్వామి

ప్ర: యమ్. కృష్ణారావు, రాజమండ్రి: ఊపిరి తీస్తుంటే భుజంకీ, ఊపిరి తిత్తులకు మధ్య వీపుమీద భాగంలో ఎముకలు పటపట విరిగినట్లు చప్పుడు అవుతవి. ఎందువలన? ఏంచేయాలి?

జ: కొందరకు నడిచేటప్పుడు, పాదాల్లో నుండి అటువంటి శబ్దాలే వస్తాయి. అంతకన్నా ఏమి ప్రమాదం లేదు. ఏమి చేయటానికి కూడా వీలు లేదు.

ప్ర: (ఎ) జ్ఞాపకశక్తికి మధ్యప్రదేశ్‌లో ఒక యూనివర్సిటీవారు మందు కనిపెట్టారు. అది ప్రచారంలోకి వచ్చింది. విడుదలైందా? దాని పేరేంటి?

జ: ప్రపంచంపుట్టిన తరువాత ఇటువంటి మందునెవరూ కనిపెట్టలేదు. మధ్యప్రదేశ్ యూనివర్శిటీ. కనిపెట్టిందేమిటో తెలియదు.

ప్ర: జి. కృష్ణమోహన్, జనగామ. నా వయసు 20 ఏళ్ళు. నేను కడుపునెప్పితో 7 ఏళ్ళ నుండి బాధపడుతున్నాను. ప్రథమ చికిత్స ఏమైనా వుందా?

జ: శస్త్రచికిత్స చేయించుకోటానికి భయపడనవసరం లేదు. నొప్పి లేకుండా, మత్తు మందిచ్చి, శస్త్రచికిత్స చేస్తారు. నిజంగా కన్నం వుండి, కాయ ఆ కన్నాన్ని మూస్తుంటే, తప్పక శస్త్రచికిత్స చేయించుకోండి.

విశాఖ. కె. జి. ఆస్పత్రిలో ప్రముఖశస్త్రవైద్యులున్నారు. వారితో సంప్రదించండి.

ప్రథమ చికిత్స ఏమి లేదు.